
సాక్షి పెద్దపల్లి

బుధవారం । 24 । మే । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,808

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి క్వింటాల్‌కు మంగళవారం గరిష్ఠంగా రూ.6,808 పలికింది.



తరుగు పేరిట పెరిగిన కోతలు

పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను దోపిడీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగకరంగా ఉండే తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం–2023 పుస్తకాన్ని కలెక్టర్ సంగీత మంగళవారం ఆవిష్కరించారు. పుస్తకం ధర రూ.150 అని, అవసరమున్నవారు కలెక్టరేట్‌లోని మొదటి ఫ్లోర్‌లో రూమ్ నంబరు 208లోని ముఖ్యప్రణాళికాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు పీఆర్ సర్కిల్ కార్యాలయం



హర్షం వ్యక్తం చేస్తున్న పీఆర్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీరాజ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా జిల్లా కేంద్రంలో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. రామగుండం, జూలపల్లి మండల కేంద్రాల్లో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయంపై పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్‌ఈ కనకరత్నం, డీఈఈ శంకరయ్య, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తదితరులు

పెద్దపల్లిరూరల్/మంథని: ధాన్యం పండించిన రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటవెంటనే కొనేలా ఏర్పాట్లు చేయాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. మంగళవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుతోపాటు మంథని ప్రాంత రైతులు, నాయకులతో కలిసి కలెక్టర్ సంగీతకు వినతిపత్రం అందించారు. తేమ పేరిట కోతలు విధిస్తున్నారని, మిల్లర్లు కూడా కటింగ్ అంటున్నారని వివరించారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు మంథనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాటాల్డారు. నెలరోజులైనా కాంటాలు సక్రమంగా జరగక రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు రైస్‌మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ధాన్యం తూకంలో వేగం పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేష్, కిసాన్ సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ పాల్గొన్నారు.

మెరిసిన ఆణిముత్యాలు

- ఆవుల సాయిక్రిష్ణకు 94వ ర్యాంకు
- శివమారుతిరెడ్డికి 132వ ర్యాంకు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు కదిలారు.. అకుంఠిత దీక్షతో చదివారు.. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించారు.. విజయానికి ఏదీ అడ్డుకాదని నిరూపించారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆవుల సాయిక్రిష్ణ, ఏనుగు శివమారుతిరెడ్డి.

– కరీంనగర్/కోరుట్ల

సుమితా డావ్రా స్ఫూర్తి



సాయిక్రిష్ణ తల్లిదండ్రులు లక్ష్మయ్య,సునీత



నా చదువంతా కరీంనగర్, హైదరాబాద్‌లో.. ఇంజినీరింగ్ వరంగల్ నీట్‌లో సాగింది. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఆవుల లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ సునీత గృహిణి. సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. రెండో ప్రయత్నంలోనే 2017 బ్యాచ్‌లో 728వ ర్యాంక్ సాధించిన. మినిస్టరీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ రీజినల్ డైరెక్టర్ (ఎస్‌ఈఆర్), హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఎలాగైనా ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఆరోసారి పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించా. ఉన్నత చదువులకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు కారణాలు కానే కావు. కంటెంట్ కాదు.. క్వాలిటీ ముఖ్యం. నేను చదువుకుంటున్న రోజుల్లో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేసిన సుమితా డావ్రా నాకు స్ఫూర్తి. ఆమె స్ఫూర్తితోనే 94వ ర్యాంకు సాధించాను.

– సాయిక్రిష్ణ

సివిల్స్‌లో మెరిసిన శివమారుతిరెడ్డి



స్వీట్లు పంచుతున్న అంజిరెడ్డి కుటుంబం

సివిల్స్‌లో పల్లె ఆణిముత్యం మెరిసింది. తండ్రి ఇచ్చిన లక్ష్యం చేరుకోవడంలో ఆ యువకుడు విజయం సాధించారు శివమారుతిరెడ్డి. మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 132 ర్యాంకు సాధించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన ఏనుగు అంజిరెడ్డి, పుష్పలత దంపతుల కుమారుడు శివమారుతిరెడ్డి. అంజిరెడ్డి మల్లాపూర్ మండలం గుండంపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్. పుష్పలత వ్యవసాయ పనులను పర్యవేక్షిస్తారు. శివమారుతిరెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం అయిలాపూర్‌లో, తొమ్మిది, పది, ఇంటర్ హైదరాబాద్‌లో సాగింది. సివిల్స్ లక్ష్యంగా ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ యూనివర్సిటీలో చేరారు.

నాన్నపై ప్రేమతో..



ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేస్తూ పిల్లలను తీర్చిదిద్దడానికి మా నాన్న పడుతున్న తపనను చిన్ననాటి నుంచి గమనించా. ఉన్నత ఉద్యోగం సాధిస్తే ఆయన బాటలోనే ప్రజలకు సేవలు అందించవచ్చన్న ఆలోచనతో సివిల్స్‌పై దృష్టి పెట్టా. అమ్మ పుష్పలత, నాన్న ఆశయాలు సాధించడానికి కష్టపడి చదివా. ప్రస్తుత ర్యాంకు 132 ప్రకారం ఐఏఎస్ క్యాడర్ వస్తుందని ఆశిస్తున్నా. అందులో చేరాక మళ్లీ సివిల్స్ రాస్తా. ఫారిన్ సర్వీసెస్ సాధించాలన్నది నా లక్ష్యం.

– శివమారుతిరెడ్డి

మట్టి మాఫియా జోరు

- అక్రమంగా ఇటుక బట్టీలకు తరలింపు
- ఇప్పటికే రూ.10కోట్ల మట్టి రవాణా
- అడ్డుకుని నిరసన తెలిపిన గ్రామస్తులు
- ఎమ్మెల్యేకు 50శాతం కమీషన్ : మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు



అక్రమ మట్టి రవాణాను అడ్డుకుంటున్న రాఘవాపూర్ గ్రామస్తులతో కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మట్టి మాఫియాకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. ఎండాకాలం వచ్చిందంటే చాలు చెరువుల నుంచి మట్టిని ఇటుకల తయారీకి బట్టీలకు అక్రమార్గంలో తరలించడం.. రూ.కోట్లు ఆర్జిస్తుండడం పరిపాటిగా మారింది. అక్రమార్కులకు కొందరు అధికారపార్టీ ముఖ్య నేతలు, పోలీసు అధికారుల అండదండలు ఉండడమే కారణమని ప్రతిపక్షాలు ఆరోపించినా అధికారుల నుంచి స్పందన ఉండడం లేదు. జిల్లాలోని రాఘవాపూర్, రంగాపూర్, గౌరెడ్డిపేట, రాంపల్లి, సుల్తానాబాద్, రామగిరి, కమాన్‌పూర్‌లో ఇటుకబట్టీలున్నాయి. ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని అందుబాటులో ఉన్న చెరువుల నుంచి వాల్టాచట్టాలను ఉల్లంఘించి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు.

అవినీతి పోలీసుల తీరు మారాలి

పెద్దపల్లిలో మట్టి, ఇసుక మాఫియాకు ప్రజాప్రతినిధులు, పోలీసులు అండదండలు అందిస్తున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు ఆరోపించారు. పెద్దపల్లిలో మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చెరువులు, గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలించుకుపోతుంటే అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. చెరువుల నుంచి బట్టీలకు గతేడాది రూ.10కోట్లకు పైగా విలువచేసే మట్టిని తీసుకునేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అనుమతి ఇచ్చి 50 శాతం కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. మట్టి మాఫియాకు సహకరించి.. అక్రమాలను అడ్డుకున్న గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఓదెల జెడ్పీటీసీ రాములు, సత్యనారాయణరెడ్డి, హాజీ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వనందునే..

రాఘవాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో గత సీజన్‌లోనే అనుమతి పొందిన దానికన్నా పెద్ద ఎత్తున చెరువు మట్టిని తరలించి సమీప ప్రాంతాల్లో నిల్వ ఉంచారు. ఈ సారి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో నిల్వ చేసుకున్న మట్టిని నాలుగురోజులుగా బట్టీలకు తరలిస్తున్నారు. రాఘవాపూర్ సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరుల సమక్షంలో ఒక్కో ట్రిప్పుకు రూ.350 గ్రామాభివృద్ధికి ఇస్తామంటూ గ్రామసభలో చేసిన తీర్మానం మేరకు 1.40 లక్షల ట్రిప్పుల డబ్బులు ఇవ్వాలంటూ గ్రామపెద్దలు డిమాండ్ చేశారు. సర్పంచ్ పట్టించుకోకపోవడంతో సోమవారం రాత్రి బసంత్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం చెరువు మట్టి తరలింపును మాట్లాడేందుకు సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. మట్టి తరలించే సమయంలో సొమ్మును ప్రభుత్వానికే చెల్లించామని, గ్రామాభివృద్ధికి చెల్లించలేమని చెప్పి వెళ్లిపోయేందుకు మట్టి మాఫియా సభ్యులు యత్నించారు. గ్రామసభలో తీర్మానించామని ఆ మేరకు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని గ్రామస్తులు వారితో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి విషమిస్తున్నట్లు గ్రహించిన పంచాయతీ పాలకులు అక్కడి నుంచి జారుకోవడం గమనార్హం.

మట్టి లారీల అడ్డగింత

రాఘవాపూర్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉంచిన మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్న టిప్పర్లను మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రావు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, హాజీ తదితరులు వెళ్లి అడ్డుకున్నారు. మైనింగ్, ట్రాన్స్‌పోర్టు అధికారులకు సమాచారమందించి అక్కడకు రప్పించారు. నిబంధనలను పాటించని లారీలను సీజ్‌చేసి ఐటీఐ మైదానానికి తరలించారు. వేబ్రిడ్జి వద్ద తూకం వేయించి ఓవర్‌లోడ్ ఉన్నట్లు తేలితే జరిమానా విధిస్తామని రవాణా అధికారులు తెలిపారు. మట్టి తరలింపునకు వేబిల్లులు లేకుంటే చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- ఆరోగ్య మహిళ కేంద్రాలపై ప్రచారం చేయాలి
- కలెక్టర్ సంగీత వెల్లడి



ఆరోగ్య మహిళ కేంద్రంలో వైద్య సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందని, వైద్యాధికారులు సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ సేవలు అందించాలని కలెక్టర్ సంగీత అన్నారు. పెద్దపల్లిలోని ఆరోగ్య మహిళాకేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. పరీక్షల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడారు. కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. చాలామంది థైరాయిడ్, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ పెద్దబొంకూర్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. అందుబాటులో రీడింగ్ అద్దాలు, మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీఓ సుదర్శన్, డాక్టర్ సృజన, స్వప్న, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

సబ్‌సెంటర్ల నిర్మాణాలు వేగిరం చేయాలి

జిల్లాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణపు పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్ తదితరులున్నారు.

బోధన ఆస్పత్రికి 49 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- విధుల్లో చేరిన 15 మంది
- అభినందించిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్



అసిస్టెంట్ ప్రొఫెసర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ (జీఎంసీ)కి అనుబంధ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (బోధన)కి కొత్తగా 49 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కేటాయించింది. ఈ మేరకు 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంగళవారం విధుల్లో చేరారు. వారిని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ అభినందించారు. జీజీహెచ్ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్జరీ విభాగంలో ఇద్దరు, ఆర్థోపెడిక్‌లో ముగ్గురు, ఆప్తమాలజీలో ఒకరు, అనస్థీషియాలో ముగ్గురు, జనరల్ మెడిసిన్‌లో ఇద్దరు, అనాటమీలో ఒకరు, బయోకెమిస్ట్రీలో ఒకరు, పాథాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరు చొప్పున రిపోర్ట్ చేశారు. వీరంతా స్థానికంగా ఉండేలా 15 రోజుల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు అరుణ, వేణుమాధవ్, అశోక్‌కుమార్, లక్ష్మీనర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పేరిట కొర్రీలు పెడితే చర్యలు

- కొనుగోలు కేంద్రాల్లో రెండు కిలోలు కోత..
- మిల్లుల్లో మరో నాలుగు కిలోల తరుగుపై ఫిర్యాదు
- రైస్‌మిల్, కేంద్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారుల విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఓఎస్డీ ప్రభాకర్

సుల్తానాబాద్‌రూరల్: ధాన్యంలో నాణ్యత పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కొర్రీలు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవని సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ (ఓఎస్‌డీ) ప్రభాకర్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు క్వింటాల్‌కు మూడు నుంచి నాలుగు కిలోల కోత పెడుతున్నారని రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం కదంబాపూర్ శివారులోని అన్నపూర్ణ రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్నపూర్ణ రైస్‌మిల్లులో రికార్డులే లేవన్నారు. ఈ మిల్లుకు 8 కేంద్రాల నుంచి ధాన్యం వచ్చిందని, కదంబాపూర్ కొనుగోలు కేంద్రం నుంచి 600 బస్తాల ధాన్యం రాగా.. మిల్లు యజమాని రెండు బస్తాల కోత పెట్టారని తేలిందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు రెండు కిలోలు ఎక్కువగా తూకం వేస్తున్నారని, మిల్లర్లు మరో నాలుగు కిలోల తరుగు తీస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. నివేదికను పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయి అధికారులు కృష్ణ, కాశీనాథ్, షఫి, శంకర్ తదితరులున్నారు.

సార్.. లెటర్ ప్లీజ్..!

- డీఎస్పీ నుంచి ఎస్సైల వరకు సిఫారసుల కోసం పరుగులు
- పోస్టింగులు ఇప్పించాలని ఎమ్మెల్యేలకు వినతులు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు బదిలీల ముహూర్తం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సివిల్ సర్వెంట్ల బదిలీలు
- త్వరలో మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఎప్పుడు ఎన్నికల షెడ్యూలు వచ్చినా.. విధుల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా పోలీసు కమిషనర్లు, ఎస్పీలు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పోస్టింగుల కోసం ప్రయత్నాలు చేసే పోలీసు అధికారులు సైతం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మూడేళ్ల గడువు తీరిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పోస్టు కోసం ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ కోసం డీఎస్పీ, ఏసీపీ ర్యాంకు అధికారుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. చాలాకాలంగా లూప్‌లైన్‌లో ఉన్న వారు, పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న వారంతా అధికార పార్టీ ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు లేఖల కోసం యత్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కొందరు, విధేయత చూపిస్తామని మరికొందరు లీడర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు ఇటీవల అడపాదడపా బదిలీ అయినా.. ఎస్సై ర్యాంకు అధికారులు మాత్రం మార్చిలోనే మరో చోటికి బదిలీ అయ్యారు.

వెంటాడుతున్న నిబంధనలు..

కరీంనగర్ జిల్లా ముందునుంచి రాజకీయంగా ప్రత్యేకతను కలిగిఉంది. సంచలనాలు, ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరున్న జిల్లాలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు పోస్టింగులు దక్కడం ఆషామాషీ కాదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పు నిప్పు అన్న పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా విశ్వసనీయతను పక్కనబెట్టి ప్రతిభావంతులు, సమర్థులైన అధికారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్ల నుంచి ఆర్డీవోలు, డీఎస్పీ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైల వరకు అందరికీ ఇదే సూత్రం పాటించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడ చిన్న లోపం దొరికినా.. ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పకడ్బందీగా పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న అధికారులంతా ఆ నియోజకవర్గంలో పనిచేయకూడదు. అదే సమయంలో గతంలో అదే నియోజకవర్గంలో ఉప ఎన్నిక లేదా జనరల్ ఎన్నికలు నిర్వహించి ఉండకూడదు.

దశాబ్ది ఉత్సవాల తరువాత బదిలీలు..

విశ్వసనీయ సమాచారం ప్రకారం...ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇన్‌స్పెక్టర్ల వంటి పోస్టింగులు చాలావరకు మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల వ్యవహారం రాజధానిలో నిర్ణయిస్తారు. కానీ... ఆర్డీవో, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై ర్యాంకు అధికారుల్లో చాలామంది తదుపరి పోస్టింగ్ ఎక్కడన్నది ఇప్పటికే దాదాపు అవగాహన ఉంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణాలతో బదిలీలు ఆలస్యమవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు అంటే జూన్ 2 తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

ఉమ్మడి జిల్లాలో కీలక అధికారుల పదవీకాలం

జగిత్యాల జిల్లా:
- కలెక్టర్: యాస్మీన్‌బాషా: ఇటీవలే వచ్చారు.
- అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): మకరంద్ ఏడాది.(లోకల్‌బాడీస్):లత రెండేళ్లు.
- ఎస్పీ: భాస్కర్, ఇటీవలే వచ్చారు.
- ఆర్డీవోలు: వినోద్, మాధురి మూడేళ్లు.
- డీఎస్పీలు: ప్రకాశ్, రవీందర్‌రెడ్డి రెండేళ్లు.

కరీంనగర్ జిల్లా:
- కలెక్టర్: ఆర్వీ కర్ణన్ రెండేళ్లు.
- అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): శ్యామ్ ప్రసాద్ లాల్ ఐదేళ్లు.
- అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): గరీమ అగర్వాల్ ఏడాదిన్నర.
- సీపీ కరీంనగర్: సుబ్బారాయుడు ఇటీవలే చేరారు.
- అడిషనల్ డీసీపీ (ఎల్‌అండ్‌వో): శ్రీనివాస్ మూడేళ్లు.
- అడిషనల్ డీసీపీ (అడ్మిన్): చంద్రమోహన్ నాలుగేళ్లు.
- ఏసీపీలు: అర్బన్ ఏసీపీ తుల శ్రీనివాస్, రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు రెండేళ్లలోపు, హుజూరాబాద్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉపఎన్నిక ముందు వచ్చారు.
- ఆర్డీవోలు: కరీంనగర్ ఆనంద్‌కుమార్ ఐదేళ్లు. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ ఇటీవలే వచ్చారు.

సిరిసిల్ల జిల్లా:
- కలెక్టర్: అనురాగ్ జయంతి.. ఏడాదిన్నర.
- ఎస్పీ: అఖిల్‌మహాజన్ ఇటీవలే వచ్చారు.
- అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): ఖీమ్యా నాయక్, ఏడాది.
- అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): సత్యప్రసాద్, రెండేళ్లు.
- ఆర్డీవోలు: సిరిసిల్ల–శ్రీనివాసరావు నాలుగేళ్లు. వేములవాడ– పవన్‌కుమార్ ఏడాది.
- డీఎస్పీలు: సిరిసిల్ల– విశ్వప్రసాద్ ఏడాది. వేములవాడ– నాగేంద్రాచారి ఏడాదిన్నర.

పెద్దపల్లి జిల్లా
- కలెక్టర్: సంగీత సత్యానారాయణ రెండేళ్లు.
- అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): లక్ష్మీనారాయణ, మూడున్నరేళ్లు.
- అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): దీపక్‌కుమార్, రెండేళ్లు.
- సీపీ రామగుండం: రేమా రాజేశ్వరి, ఇటీవలే వచ్చారు.
- ఆర్డీవోలు: పెద్దపల్లి–వెంకట మాధవరావు, మంథని– వీర బ్రహ్మచారి ఇద్దరూ ఇటీవలే వచ్చారు.
- డీఎస్పీలు: ఎడ్ల మహేశ్ ఇటీవలే వచ్చారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ రెండేళ్లు.







రెండోరోజూ ఉత్సాహంగా..

సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు రెండోరోజు ఉల్లాసంగా సాగాయి. స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో రెండోరోజు పోటీలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ పర్యవేక్షించారు. కబడ్డీ, ఖోఖో, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వ జహించారు. పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాధవ్‌రావు, డీఆర్‌డీఏ శ్రీధర్, డీఈవో డి.మాధవి పాల్గొన్నారు.

– గోదావరిఖని

క్లుప్తంగా

అంతర్జాతీయ ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆహ్వానం


శివరామకృష్ణ

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్టీయూ కళాశాల మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పని చేస్తున్న త్రీడీ ఆర్టిస్ట్ సింగారపు శివరామకృష్ణకు అంతర్జాతీయ ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆహ్వానం అందింది. అమెరికాలోని డౌన్‌టౌన్ మిన్నియాపాలిస్‌లో ఏటా ఆగస్టు 12,13 తేదీల్లో నిర్వహించే స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్‌కు రావాలని ఆహ్వానం పంపించారు. ఈ ఆర్ట్ ఫెస్టివల్‌లో ప్రపంచంలోని త్రీడీ ఆర్టిస్టులంతా పాల్గొంటారు. కాగా వివిధ దేశాలకు చెందిన త్రీడీ ఆర్టిస్టులతో కలిసి పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని శివరామకృష్ణ అన్నారు. గతంలో అతడికి గ్రీస్ దేశం నుంచి ఆహ్వానం వచ్చింది. ఈసందర్భంగా శివరామకృష్ణకు ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్‌రెడ్డి, ఈఈఈ విభాగ అధిపతి దుర్గారావు, డీఈఈ సతీశ్ హర్షం వ్యక్తం చేశారు.

నాటుసారా తయారీదారుడికి ఏడాది జైలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన సంపంగి రమేశ్ అనే వ్యక్తి నాటుసారా తయారు చేసినందుకు ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. గతంలో రమేశ్ నాటుసారా తయారు చేస్తూ పట్టుబడగా. తహసీల్దార్ అనుపమరావు ఎదుట హాజరుపరిచారు. రూ.లక్ష పూచీకత్తుతో ఆయనను బైండోవర్ చేశారు. రమేశ్ నాటుసారా తయారుచేస్తూ మరోమారు పట్టుబడ్డాడు. దీంతో మరోసారి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. రమేశ్ రూ.లక్ష చెల్లించక పోవడంతో ఏడాది జైలు శిక్ష విధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రమేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సంపత్, మనోహర్ పాల్గొన్నారు.

నో ఎఫెక్ట్..

రూ.రెండు వేల నోట్ల రద్దుతో ఖాతాదారులు నోట్లను మార్చుకునేందుకు.. డిపాజిట్ చేసేందుకు ఎగబడతారని భావించిన బ్యాంకర్లు ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని పలు బ్యాంకుల ముందు టెంట్‌లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. కానీ.. ఒకరిద్దరు మినహా పెద్దనోట్లు మార్చుకునేందుకు జనాలు రాకపోవడంతో బ్యాంకులన్నీ వెలవెలబోతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



తరుగు పేరిట పెరిగిన కోతలు

- రైతులను ముంచుతున్న మిల్లర్లు
- న్యాయం కోసం కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి
- జిల్లావ్యాప్తంగా కేంద్రాలను సందర్శించిన నాయకులు


పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న గుజ్జుల

పెద్దపల్లిరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దోపిడీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని వ్యవసాయమార్కెట్ యార్డు, హన్మంతునిపేటలోని కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, కౌశిక హరి, మీస అర్జున్‌రావు, కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్ తదితరులతో కలిసి సందర్శించారు. మిల్లర్లతో ములాఖత్ అయ్యి రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు రాజు, శ్రీనివాసరావు, సమ్మయ్య, ఫహీం ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

జూలపల్లి: ధాన్యం కొనుగోలు సేకరణలో వేగం పెంచాలని గుజ్జుల అన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి సందర్శించారు. అధికారులు పట్టించుకోక పోవడంతో మిల్లర్లు ఇష్టంవచ్చినట్లు తరుగు తీస్తున్నారని ఆరోపించారు. కంకణాల జ్యోతిబసు ఉన్నారు.

రైతుల నుంచి దోపిడీ ఆపాలి

ఎలిగేడు: రైతులను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కలిసి దోచుకుంటున్నారని, ఆ విధానానికి స్వస్తి పలకాలని గుజ్జుల అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్, ఇల్లందుల పరుశరాములు, గాదె రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కు

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని రామకృష్ణారెడ్డి ఆరోపించారు. మండలంలోని మల్లాపూర్, ఖిలావనపర్తి, ధర్మారం మార్కెట్‌యార్డుల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రం ధాన్యం కొంటున్నా.. రాష్ట్ర ప్రభుత్వం తూకం వేసి పంపించడంలో విఫలమవుతోందన్నారు. పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి, సందనవేని లక్ష్మణ్, తీగుల్ల సతీశ్‌రెడ్డి, మెడవేని శ్రీనివాస్ ఉన్నారు.

అధికారుల ములాఖత్

పాలకుర్తి: అధికారులు మిల్లర్లతో ములాఖత్ అయి ధాన్యంలో కోత పెడుతున్నారని గుజ్జుల పేర్కొన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలుకేంద్రాలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. జిల్లా పౌరసరఫరాల అధికారితో ఫోన్లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. నాయకులు పర్శ సమ్మయ్య, పిన్నింటి రాజు, ఆకుల శశికుమార్, మూకిరి రాజు, తోడేటి రవికుమార్ పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం

ఓదెల: రైతు పక్షపాతి అని చెబుతున్న కేసీఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని రామకృష్ణారెడ్డి అన్నారు. కొలనూర్ సెంటర్‌ను సందర్శించారు. రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టడం లేదన్నారు. కర్రె సంజీవరెడ్డి, ఆది కేశవరావు, తాజ్, పుల్లూరి పృథ్వీరాజ్, కొంగర అనిల్ ఉన్నారు.

రైతులను ముంచుతున్నా పట్టదా..?

సుల్తానాబాద్: ధాన్యంలో తరుగు, తాలు, తప్ప పేరుతో నాలుగు కిలోలు కోత పెడుతున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గుజ్జుల ప్రశ్నించారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కదంబాపూర్ గ్రామంలోని ఓ రైస్ మిల్లులో అత్యధికంగా కోతలు పెడుతున్నట్లు తేలిందని, ఇలా జిల్లా వ్యాప్తంగా జరుగుతోందని విమర్శించారు. దోపిడీ ఆపకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కడారి అశోక్‌రావు, ఎల్లంకి రాజన్న, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం మహిపాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పుట్ట మధు

మంథని: రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కష్టాలు పడేవారని, అలాంటి పరిస్థితులు పోయి కార్లు తిరిగే రోజులు రాబోతున్నాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని సబ్ రిజిస్ట్రార్ సమీపంలోని బన్నె చెరువు నుంచి ఖానాపూర్ వాగు వరకు రూ.1.50 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రైతులు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను తెల్సుకొని రోడ్డు నిర్మాణం కోసం కృషి చేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన కళ్లు సజీవం


దిలీప్‌కుమార్(ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన ఆముల దిలీప్‌కుమార్(35) మూడు రోజుల క్రితం అకస్మాత్తుగా కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. కాగా కొడుకును కోల్పోయిన దుఃఖంలో కూడా నేత్రాలను దానం చేయడానికి తల్లిదండ్రులు లక్ష్మి–రామయ్య ముందుకు వచ్చారు. మృతుడి చిన్నాన్న అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సదాశయ ఫౌండేషన్‌వారు నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. కొడుకు నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన తల్లిదండ్రులతో పాటు తమ్ముడు ప్రసన్నకుమార్, సోదరి అనూష, సమీప బంధువు మంత్రి కొప్పుల ఈశ్వర్, కార్పొరేటర్ రాజు తదితరులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, రమేష్, భీష్మాచారి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, ప్రతినిధి బేనిగోపాల్ త్రివేది అభినందించారు.

బౌద్ధ బిక్షువుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న బౌద్ధ బిక్షువులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక స్నేహ సాహితి గ్రంథాలయంలో బౌద్ధ బిక్షువులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోని ప్రతీ గ్రామంలో బౌద్ధ జీవన విధానం కొనసాగిందని పేర్కొన్నారు. ఇక్కడి పోచమ్మ, మైసమ్మ దేవతలందరూ బౌద్ధులేనని వివరించారు. ప్రేమ, దయలాంటి భావనలు సమాజంలో బౌద్ధం ద్వారానే నిలబడ్డాయని పేర్కొన్నారు. మనిషి కరుణ, మైత్రి భావనను కలిగి ఉంటే సమాజం నుంచి దుఃఖం, ఒత్తిడులు పోతాయన్నారు. సమావేశంలో ఏలేశ్వరం వెంకటేష్, మాస రాజయ్య, డా.సదానందం, కనకరాజు, పోచయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం


చర్చలు జరుపుతున్న కేంద్ర కార్మిక శాఖ అధికారి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కేంద్ర కార్మిక శాఖ అధికారి తెలిపారు. కార్మికులకు వేతనాలు, వసతులు కల్పించాలని యూనియన్ నాయకులు అంబటి నరేశ్ వినతిపత్రం అందించగా.. ఆయన మంగళవారం చర్చలకు ఆహ్వానించారు. యాజమాన్యం, కార్మికులతో చర్చించిన అధికారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లింగాల సారన్న, భత్తుల రాములు, కే.రాజయ్య, నిమ్మల రవి, బొడ్డుపల్లి రాజు పాల్గొన్నారు.

భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బదిలీ

గోదావరిఖని: సింగరేణి భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.నర్సింహమూర్తి బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంగా పనిచేస్తున్న నర్సింహమూర్తిని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో మంగళవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నకిలీ, కల్తీ, కాలంచెల్లిన విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి అలివేణి హెచ్చరించారు. సీడ్ కంట్రోల్ యాక్టు నిబంధనలు పాటించాలన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండంలో..

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. షాపుల్లో ఉన్న ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ మధుసూదన్‌రావు, వసుధ, మండల వ్యవసాయాధికారి భూక్యా రాంబాబు తదితరులున్నారు.

లక్ష్యాల సాధనలో సమష్టిగా కృషి చేయాలి

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్


ప్రాజెక్టు క్వారీ పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఓసీపీ–3,5 ప్రాజెక్టులను సందర్శించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ముందుగా సర్వే మ్యాప్ ద్వారా పని స్థలాలను పరిశీలించారు. ఓసీపీ–3, 5 ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తికి ఏర్పాట్లు చేయాలన్నారు. గనికి కేటాయించిన లక్ష్యాలు, అందుకు చేపట్టవలసిన ప్రణాళికలు అధికారులకు సూచించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ప్రాజెక్టు అధికారులు మధుసూదన్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, రమేష్, నర్సింగరావు, వీరారెడ్డి తదితరులున్నారు.

తూకం వేసి మిల్లులకు తరలించాలి


రైతులతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకవచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి తరలించాలని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సాయంపేట, మేడారం గ్రామాల్లోని ధాన్యం కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ఆరోపించారు. వేసిన తూకం బస్తాలను సైతం లారీలు సకాలంలో రాక తరలించటం లేదన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో ప్రభుత్వ యంత్రాంగం స్పందించి త్వరగా ధాన్యం తూకం వేసి రైసు మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులు అరిగె లింగయ్య, కాంపెల్లి లింగయ్య, బొలిశెట్టి రాజిరెడ్డి, వీర్‌పాల్, నరేశ్, ఉత్తం రాజయ్య తదితరులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కోలిండియా ఒప్పందాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కోలిండియా ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు. అలవెన్స్‌లపై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు కార్మికులందరికీ సొంతింటి పథకం అమలు చేయాలని, సంస్థ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాలని, బొగ్గు తీసే పనులు సింగరేణి కార్మికులతోనే చేయించాలని పేర్కొన్నారు. సింగరేణికి రావాల్సిన ప్రభుత్వ బకాయిలు చెల్లించాలన్నారు. డిపెండెంట్ల వయస్సు 40ఏళ్లకు పెంచాలని, అండర్ గ్రౌండ్‌లో పనిచేసే సర్ఫేస్‌కు వచ్చిన మైనింగ్, టెక్నికల్, ఈపీగ్రేడ్స్ కార్మికులు వేజ్ ప్రొటెక్షన్ కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, అసరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజారెడ్డి


రాజారెడ్డి


నర్సింహారావు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా తుమ్మల రాజారెడ్డిని మరోసారి ఎన్నుకున్నారు. గోదావరిఖనిలో జరిగిన యూనియన్ మహాసభల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద నరసింహారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్.నాగరాజుగోపాల్, ఉపాధ్యక్షుడిగా బి.మధు, కోశాధికారిగా వై.వెంకటేశ్వర్లును నియమించారు. ఆర్జీ–1 ఏరియా నుంచి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మెండె శ్రీనివాస్, కార్యదర్శులుగా మేదరి సారయ్య, ఆసరి మహేశ్, సభ్యులుగా సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌కే.గౌస్, దాసరి సురేష్, ఆరెపల్లి రాజమౌళి, అన్నం శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, మల్యాల శ్యామలను ఎన్నుకున్నారు.

కార్మికులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం

- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్


కార్మికులను కలుసుకుంటున్న రియాజ్

గోదావరిఖని: డిప్యూటేషన్ల పేరుతో కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ అన్నారు. మంగళవారం జీడీకే–1గనిలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పనిస్థలాల్లో సమయానికి యంత్రాలు ఇవ్వడం లేదన్నారు. సరైన వెంటిలేషన్ ఉండడం లేదని, ఓవర్‌టైం పనిచేస్తున్న కార్మికులకు అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. సీఎం వద్దకు వెళ్లి మాట్లాడే ధైర్యం టీబీజీకేఎస్ నాయకులకు లేదన్నారు. ఆర్జీ–1 ఏరియాలో 200 సర్ఫేస్ ఉద్యోగాలు ఉన్నాయని, వాటిని సీనియార్టీ ప్రకారం ఇవ్వాలన్నారు. సింగరేణిలో ఎన్నికలు పెట్టడానికి భయపడుతున్నారన్నారు. వేజ్‌బోర్డులో మెరుగైన ఒప్పందం చేశామని జూన్‌లో అదనపు వేతనాలు చెల్లిస్తామన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు రాంచందర్‌రావు, కొమురయ్య, జక్కుల నారాయణ, కుమారస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న శ్రీదేవి

కమాన్‌పూర్(మంథని): తెలంగాణ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక, ఆటల పోటీల కార్యక్రమాలకు మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆర్జీ–3 సేవా అధ్యక్షురాలు టి.శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం రామగిరి అతిథి గృహంలో సేవా సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సేవా సభ్యులతో పాటు సింగరేణి కార్మిక కుటుంబాల సభ్యులు, పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొనేలా సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో ఏపీఏ జీఎం వెంకటేశర్లు, విజయలక్ష్మి, డీవైపీఎంకే మారుతి, సేవా సభ్యులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎంలు

కమాన్‌పూర్(మంథని): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న ఆర్జీ–3 పరిధిలో నిర్వహించే వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు టి. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. గనులు, కార్యాలయాలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించాలన్నారు. జూన్ 2న ఉదయం అన్ని గనులు, కార్యాలయాలపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. అమరవీరుల స్తూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలతో నివాళి అర్పించాలని, జీఎం కార్యాలయం నుంచి తెలంగాణ రన్ నిర్వహించి రుద్రమాదేవి క్రీడ మైదానంలో సాయంత్రం సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు బైద్య, శ్రీనివాసులు, రమేష్, జైనుల్లబద్దిన్, చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, కర్ణ, లక్ష్మీనారాయణ, పద్మరాజు, నాగేశ్వర్‌రావు, కళ్యాణ చక్రవర్తి, ఉదయ్ హరిజన్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న సాంబయ్య

గోదావరిఖని(రామగుండం): యంత్రాల వినియోగంపై సరైన రక్షణ చర్యలు తీసుకొని ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలని రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ–1లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలు, అందుకు గల కారణాలను విశ్లేషించారు. లైట్ వెహికిల్స్ అయిన బొలెరోలు, క్యాంపర్లు, బస్సులు నడిపే కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతీ ఉద్యోగి రక్షణను తన వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఆఫీసర్ జి.రఘుపతి, మేనేజర్ ఉదయ్‌హరిజన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్, రక్షణ అధికారి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


మొక్కలతో ఆర్జీ–1 జీఎం, అధికారులు

గోదావరిఖని(రామగుండం): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయం ఆవరణలో మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 5వరకు పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించి ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్‌రావు, ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించండి


డైరెక్టర్(పా)తో ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డైరెక్టర్(పా) బలరాంను కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం కలిశారు. సింగరేణికి చెందిన ఖాళీ స్థలాల్లో అనేక ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న వారికి జీవో నెంబర్ 76 ప్రకారం పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నం 76 ప్రకారం పట్టాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నప్పుడు కొన్ని సర్వే నంబర్లు రిజెక్ట్ అవుతున్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన జనగామ వంతెనను త్వరగా పునర్నిర్మించాలని, తాగునీటి సమస్య ఉన్నందున ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డైరెక్టర్ బలరాం సానుకూలంగా స్పందిస్తూ రానున్న రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి వచ్చి సమస్యలను స్వయంగా పరిశీలించి, తగిన పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.